క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

అయినవిల్లి: అయినవిల్లి, చింతనలంక గ్రామాల్లో ఎండోమెంట్ భూమి రికార్డుల్లో సర్వే నంబర్ల దొర్లిన తప్పుల వల్ల పలువురు రైతుల పంట భూములు, ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ కావడం లేదు. ఈ సమస్యలను పరిష్కరం కోరుతూ బాధితులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర శుక్రవారం అయినవిల్లి, చింతనలంక గ్రామాల్లో 22 ఏ లోని సర్వే నంబర్ 348/3లోని, 5/3లోని భూముల రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరితగతిన ఈ సమస్య పరిష్కరిస్తామని ఆయన స్థానికులకు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ డి.అశోక్ ప్రసాద్, ఆర్ఐ శివ అర్జునరావు, వీఆర్వో ఈవీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రావులపాలెం: స్థానిక అలివేలు మంగా పద్మావతి అండాల్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పార్కు చెరువులో నిర్వహించిన స్వామివారి తెప్పోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

మలికిపురం: పేదలకు వసుధ ఫౌండేషన్ శుక్రవారం ఆర్థిక సాయం అందించింది. విశ్వేశ్వరాయపురంలో ప్రమాదవశాత్తూ గాయపడిన నేదునూరి వెంకటేశ్వర్లుకు రూ.20 వేలు, బట్టేలంక గ్రామంలో ముగ్గురు మహిళలకు రూ.30 వేలను అందించారు. వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన సత్యనారాయణరాజు సూచనలతో ఈ సాయం అందించారు.

దేశ సంపదను దోచిపెడుతున్నారు

అంబాజీపేట: ప్రజా ధనాన్ని, దేశ సంపదను అదానికి దోచిపెడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలను ప్రధాని మోదీ మోసం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ములపర్తి మోహనరావు, పీసీసీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ అన్నారు. అంబాజీపేట స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట మోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎస్బీఐ, ఎల్ఐసీ ఆస్తులను దారదత్తం చేయడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో ఆదుర్తి నారాయణమూర్తి, కొల్లు సరోజిని, అప్పన రామకృష్ణ, యర్ల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఆడిట్‌పై శిక్షణ

రాజోలు: సహకార సంఘాల ఆడిట్ నిర్వహణపై రాజోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వద్ద శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు మాట్లాడుతూ ఆడిట్ నిర్వహణతో సహకార సంఘాల పారదర్శకత తేటతెల్లమవుతుందన్నారు. ఆడిట్ సమయంలో గుర్తించిన లోపాలను సవరించేందుకు పాలకవర్గాలు సహకరించాలన్నారు. జిల్లా సహకార సంఘ ఆడిట్ అధికారి ఎస్.మురళీకృష్ణ, రాజమంహేంద్రవరం రామదాసు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐగా అరుణమ్మ

ఆలమూరు: స్థానిక ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ అరుణమ్మ బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఎస్బీఐ కార్యాలయం సీఐగా పని చేసిన ఆమె బదిలీపై ఆలమూరుకు వచ్చారు. ఇప్పటి వరకూ సీఐగా పని చేసిన కె.శ్రీధర్ బదిలీపై రాజోలు వెళ్లిపోయారు. ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో సారా, గంజాయి తదితర మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆలమూరు: ర్యాలికి చెందిన మెర్ల కొండయ్య (24) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆత్రేయపురం ఎస్సై సీహెచ్ సుధాకర్ కథనం ప్రకారం... అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కొండయ్య ఈనెల ఎనిమిదిన పురుగు మందు సేవించాడు. అపస్మారక స్థితికి చేరుకున్న కొండయ్యను కుటుంబ సభ్యులు రావులపాలెం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈమేరకు కేసును నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సబ్సిడీపై ఎరువుల పిచికారీ డ్రోన్లు

మలికిపురం: సబ్సిడీపై ఎరువుల పిచికారీ డ్రోన్‌లను ప్రభుత్వం అందిస్తున్నట్లు రాజోలు వ్యవసాయ శాఖ ఏడీఏ రామ్మోహనరావు తెలిపారు. లక్కవరం గ్రామంలో డ్రోన్ల వినియోగంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు.

సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రై డే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. అనంతరం ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

అంబాజీపేట: పంట నమోదుకు సంబంధించి సామాజిక తనిఖీ నివేదికను ఆయా గ్రామాల ఆర్బీకేల వద్ద ప్రదర్శిస్తామని అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్.జె.వి.రామమోహనరావు అన్నారు. అంబాజీపేట మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.ఎం.శెట్టి అధ్యక్షతన సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది.

స్మార్ట్ చదువులు



కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్ ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తున్న హెచ్ఎం శర్మ

- ఆసక్తికరంగా.. ఆకట్టుకునేలా..
- సర్కారు స్కూళ్లలో ట్యాబ్‌లతో విద్యాభ్యాసం
- పేద విద్యార్థుల చేతుల్లో డిజిటల్ ప్రపంచం

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం ఆసక్తికరంగా ఉంటోంది. సర్కారు అందించిన ట్యాబ్‌లతో విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధిస్తున్నారు. ఒకప్పుడు ఇంగ్లిష్ ల్యాబ్‌లు కార్పొరేట్ స్కూళ్లలోనే ఉండేవి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులు కూడా కార్పొరేట్ పాఠశాలల దీటుగా చదువుకోవాలని, సాంకేతికంగా అభివృద్ధి సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన విద్యా విధానం తీసుకువచ్చింది. నాడు–నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా సకల సౌకర్యాలు కల్పించింది. దీనిలో భాగంగా ఇంగ్లిష్ విద్యాబోధన ప్రవేశపెట్టింది. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసింది. ఇంగ్లీషు ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూములు అందుబాటులోకి తీసుకువచ్చింది. ముఖ్యంగా ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్ఈ విధానంలో ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన అమలులోకి తెచ్చింది. నియోజకవర్గంలోని 45 పాఠశాలల్లో 2450 మంది విద్యార్థులకు, 418 మంది ఉపాధ్యాయులకు కలిపి మొత్తం 2,868 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్యాబ్‌లో బైజూస్ యాప్‌ను నిక్షిప్తం చేశారు. ఈ పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. నిర్దేశించిన ప్రకారం ప్రతిరోజు ప్రత్యేకంగా ట్యాబ్‌ల ద్వారా క్లాసులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు సాధారణ పాఠాల కన్నా ట్యాబ్ పాఠ్యాంశాలపై ఆసక్తి చూపుతున్నారు. ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన, విద్యాభ్యాసం సులభతరమైంది. అన్ని సబ్జెక్టులను తెలుగు, ఇంగ్లిష్‌లో ఉంటాయి. దానిలోనే పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా ప్రశ్నలకు విద్యార్థులు ఇచ్చిన జవాబు కరెక్టా? కాదా? అసలైన జవాబు ఏమిటి అనేది వివరిస్తుంది. ఈ విధంగా సర్కారు బడుల్లో పేద, సామాన్య విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యార్థులను తలదన్నేలా సాంకేతికంగా ముందుకు వెళ్లనున్నారు. డిజిటల్ ప్రపంచాన్ని చేతిలో పెట్టుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించనున్నారు.

సులభంగా అర్థమవుతున్న పాఠ్యాంశాలు



గతంలో అర్థంకాని పాఠాలు ఇప్పుడు ట్యాబ్‌ల ద్వారా తెలుసుకుంటున్నాం. ప్రైవేట్ స్కూలు విద్యార్థులు డిజిటల్ పాఠాలు ద్వారా విజ్ఞానం పొందతున్నారని అనుకునేవాళ్లం. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కూళ్లలో చదువుకునే మా లాంటి పేద, సామాన్య విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. సులభంగా పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయి. సాంకేతికంగా ముందుకు వెళ్లడానికి ఈ ట్యాబ్ మాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– రాయపాటి లోహ్న,
8 వ తరగతి విద్యార్థిని, కొత్తపేట

లక్ష్యంపై ఆసక్తి



ప్రభుత్వం ఏ లక్ష్యంతో అయితే ఆ ట్యాబ్‌లు అందజేసిందో ఆ లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ ట్యాబ్‌లు ఇచ్చినప్పటి నుంచీ ప్రతి రోజూ స్కూల్‌కు హాజరవుతున్నారు. నేరుగా వీడియోల రూపంలో కనిపిస్తున్న పాఠ్యాంశాలను చక్కగా అర్థం చేసుకుంటున్నారు. పాఠ్యాంశాలన్నా, పరీక్షలన్నా వారిలో భయం పోయింది. ప్రతి శుక్రవారం అప్‌డేట్ చేస్తాం. ట్యాబ్‌ను ఏ విద్యార్థి ఎంతసేపు ఉపయోగించారో రిపోర్టు కూడా తయారుచేస్తాం.

– బి.నారాయణరావు,
పీఎస్ ఉపాధ్యాయుడు, జెడ్పీ జీహెచ్ఎస్, కొత్తపేట

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- నరేంద్రపురంలో గడప గడపకూ



నరేంద్రపురంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతో రాష్ట్ర ప్రజలంతా ఆయనకు మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నరేంద్రపురంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు మెల్లం మహలక్ష్మీ ప్రసాద్, పార్టీ నాయకులు జల్లి శ్రీను, రాయుడు చిన్న, నేలపూడి సత్యనారాయణ, గుత్తుల త్రిమూర్తులు, సత్యనారాయణ తదితరులతో కలిసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌లు బీర వెంకమాంబ, కొంబత్తుల ఏసు, పార్టీ నాయకులు కొంబత్తుల శేఖర్, యన్నాబత్తుల ఆనంద్, సాధనాల రమేష్, ఇళ్ల నాగేశ్వరరావు, కోట నాగేంద్రప్రసాద్, బండి రమేష్, పప్పుల శ్రీను, రాంబాబు, కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కలిసిన పెన్షనర్లు

మామిడికుదురు: అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని రాజోలు పెన్షనర్లు అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే చిట్టిబాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్.నారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు వై.పురుషోత్తం, ఎం.సీతారామచంద్రమూర్తి తదతరులు వినతి పత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ముక్కామలలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంబాజీపేట, అయినవిల్లి: నిబంధనల మేరకు రహదారుల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముక్కామల నుంచి అయినవిల్లి మండలం నేదునూరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం

పి.గన్నవరం: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని మొండెపులంక, నాగుల్లంక గ్రామాల్లో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు అధ్యక్షతన శుక్రవారం గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి జరుగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. గృహ సారథులకు, కన్వీనర్లకు చిట్టిబాబు కిట్ల పంపిణీ చేశారు. సర్పంచ్‌లు గుడాల రామారావు, తోలేటి బంగారునాయుడు, ఎంపీటీసీ కారుపల్లి సునీత, పార్టీ నాయకులు పితాని నర్సింహరావు, కొల్లాటి వెంకట్రావు, మంగం చిట్టిబాబు, బొక్కా ఏడుకొండలు, కేతా శ్రీను, కారుపల్లి శ్రీను, గిడుగు రామకృష్ణ, మానుకొండ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వానపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయం

- టీటీడీ నిధులు రూ.1.02 కోట్ల మంజూరు
- నిర్మాణానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి శంకుస్థాపన



వానపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: వానపల్లి సంతమార్కెట్ ప్రాంతంలో శ్రీదేవి–భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ ఆలయానికి సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిధులు రూ.1.02 కోట్లు మంజూరు కాగా సుందరంగా ఆలయాన్ని నిర్మించేందుకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, స్థానిక పెద్దలు నేమాని భాస్కర్ ఆధ్వర్యంలో ప్లాన్ రూపొందించారు. ఆ మేరకు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన వైఖానస విద్యాపీఠం పండితుడు ఖండవిల్లి సూర్యనారాయణమూర్తి, వేద పండితులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. వేదాశీర్వచనం అనంతరం గ్రామంలో గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి జగ్గిరెడ్డి తన వ్యక్తిగతంగా రూ.3 లక్షలు చెక్కును ఆలయ అధికారికి అందజేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, డీసీసీబీ పర్సన్ బండారు సత్తిరాజు, మాజీ సర్పంచ్ కామిశెట్టి అమ్మన్న, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మునునూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు వనుము రాంబాబు, దుప్పలపూడి మాధవరావు, ఆలయ కమిటీ సభ్యులు అన్నందేవుల మాధవరావు, బండారు నాగేశ్వరరావు, వానపల్లి ప్రభాకరరావు, తాపిరెడ్డి రామ గణేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల నిలుపుదల

మామిడికుదురు: శ్మశాన వాటిక సమస్య పరిష్కరించేత వరకూ 216 జాతీయ రహదారు నిర్మాణ పనులను నిలుపుదల చేస్తున్నామని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ చెప్పారు. గెద్దాడలో జరుగుతున్న జాతీయ 216 రహదారు పనులను, శ్మశాన వాటికను తహసీల్దార్ శుక్రవారం పరిశీలించి గ్రామస్తులతో చర్చించారు. శ్మశానవాటికు ప్రత్యామ్నాయంగా సర్వే నెం.41లో 1.10 ఎకరాల భూమిని కేటాయించామని, దీనిపై గతంలో రైతులతో చర్చించామన్నారు. మరోసారి ఈ నెల 15వ తేదీన చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు. అప్పటి వరకు గెద్దాడలో రోడ్డు పనులు చేపట్టబోమని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆర్ఐ ఎం.బి.ఆలీ, వీఆర్వో వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ఎంపీటీసీ పాల్గొన్నారు.

14 నుంచి డీవార్మింగ్ డే కార్యక్రమం

రాజోలు: ప్రభుత్వం ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న డీవార్మింగ్ డేను విజయవంతంగా నిర్వహించాలని తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ఫణికిరణ్ సూచించారు. శుక్రవారం రాజోలు మండల పరిషత్ హాలులో ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులకు డీవార్మింగ్ డే కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలపై డాక్టర్ ఫణికిరణ్ వివరించారు. ఏఓ ఎం.సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ నెల 14వ తేదీ నుంచి చేపట్టే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, ఆశ కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఒకటి నుంచి 19ఏళ్ల వారికి నులిపురుగుల నివారణ సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ సీహెచ్ లక్ష్మీకళ్యాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పీ పద్మ, సచివాలయాల సెక్రటరీలు, సిబ్బంది, పీహెచ్‌సీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సరఫరా వంతు 48 గంటలకు పెంచాలి



కొత్తపేట మండల ఏఏబీ సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ పద్మలత

కొత్తపేట: రబీ(దాళ్వా) పంటకు సాగునీరు వంతుల వారీ విధానంలో వాడపాలెం లాకు వద్ద 24 గంటల నుంచి 48 గంటలకు పెంచాలని మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం కోరుతూ తీర్మానించింది. శుక్రవారం ఉదయం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి (ఏఓ) పి.పద్మలత అధ్యక్షతన సమావేశం జరిగింది. దాళ్వా పంటకు సంబంధించి చానల్స్ శివారు భూములకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాడపాలెం లాకు వద్ద వంతు సమయాన్ని పెంచి పూర్తిస్థాయిలో నీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు ఇరిగేషన్ ఏఈ వి.నవీన్ దృష్టికి తీసుకువచ్చారు. ఓల్డ్ వాడపాలెం చానల్ పనసలదొడ్డి నుంచి రెండో నంబర్ డ్యామ్ వరకూ సుమారు 3 కిలోమీటర్లు పూడిక తీయాలని తీర్మానించారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం ప్రాంతంలో డ్రైనేజీను పంట కాలువలో కలపడాన్ని రైతులు వ్యతిరేకించారు. లంక ప్రాంతాల్లో మోటార్లకు 9 గంటల ఉచిత విద్యుత్ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య సరఫరా చేయాలని ఆ రైతుల తరపున బాపిరాజు ఆ శాఖ ఏఈ పి.సతీష్‌ను కోరారు. ఏఓ పద్మలత మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ స్పెషల్ ఆడిట్ ఈ నెల 8 నుంచి అన్ని ఆర్‌బీకేలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 13 నుంచి 15 వరకూ గ్రీవెన్స్ స్వీకరణ, 20న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు. ఏడీహెచ్ వై.రుక్మాంగధరరావు తర్ఐ కె.ఏడుకొండలు, ఏఏబీ సభ్యులు, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత ఫ్యాక్టరీగా నాగార్జున

- డీసీఐఎఫ్ రాధాకృష్ణ కితాబు
- ఘనంగా ఎన్ఏసీఎల్ భద్రతా వారోత్సవాలు

కొత్తపేట: ప్రతి కార్మికుడు వ్యక్తిగత క్రమశిక్షణ, భద్రతా చర్యలతో ప్రమాద రహిత ఫ్యాక్టరీగా ఈ నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్ఏసీఎల్) నిలిచిందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (డీసీఐఎఫ్) డి.రాధాకృష్ణ అన్నారు. మండల పరిధిలోని గంటి సమీపంలో నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (గంటి పెస్టిసైడ్స్ ఇండస్ట్రీ) ప్రాంగణంలో 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఫ్యాక్టరీ యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం సాయంత్రం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్లాంట్ హెడ్, సీనియర్ జీఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో డీసీఐఎఫ్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా ఫ్యాక్టరీ కార్మికులకు, గంటి, ఈతకోట, పలివెల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏసీఎల్ హెచ్‌పీడీ హెడ్ పీ సుభాకర్, ప్రొడక్షన్ హెడ్ వై ప్రవీన్‌కుమార్, ఫ్యాక్టరీ సేఫ్టీ ఆఫీసర్ పి.కోటేశ్వరరావు తదితర అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వ సభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హాజరయ్యారు. నేదునూరు–2 ఇండుగుల వెంకటామయ్య, క్రాప, శంకరాయగూడెం ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీరామూర్తి, శంకరాయగూడెం సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు మధ్య వాగ్వాదం జరిగింది. ఇండుగుల వెంకటామయ్య తమ గ్రామ సమస్య పరిష్కరం కోసం మాట్లాడుతున్నప్పుడు గుత్తుల శ్రీరామూర్తి, బొక్క కామేశ్వర రావు జోక్యం చేసుకోవడంపై వెంకట్రామయ్య మండిపడ్డారు. దీంతో సమావేశం ఒక్క సారిగా వెడెక్కింది. మిగిలిన సభ్యులు, అధికారులు సర్ది చెప్పడంతో కొంత సేపటికి సద్దుమణిగింది. ఈ సమావేశంలో ఉపాధి హామీ పనులు, శానపల్లిలంక గ్రామానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను తదితర వాటిని ఆమెదించి తీర్మానించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా చూడాలని, పంటలకు సాగునీటిని సక్రమంగా అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్, సీపీడబ్ల్యూఎస్ అధికారులను, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి వై.సత్యనారాయణ, ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

అంబాజీపేట: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఐ.రత్నంరాజు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ రత్నంరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చలమయ్య పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో వాకలగరువు, తొండవరం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుందని, ముందస్తు చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు వివరించామన్నారు. మే నెలలో మంచినీటి ఎద్దడి రాకుండా ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

బాలాజీ అన్నదాన ట్రస్ట్‌కు రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లిలోని బాలబాలజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు పాశర్లపూడి బాడవకు చెందిన తోరం సూర్యభాస్కర్, శేషశైల దంపతులు రూ.10,200 విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంకేటీఎస్ వరప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు. భాస్కరరావు, శేషశైల దంపతుల పుట్టిన రోజులను పురస్కరించుకుని ఏటా మార్చి 10న స్వామివారి సన్నిధిలో అన్నదానం జరిపించాలని వారి కోరినట్టు తెలిపారు. అనంతరం భాస్కరరావు దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ ఈఓ వరప్రసాద్, చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ధర్మకర్త మండలి సభ్యులు అందజేశారు.

సాగు నీరందించాలి

మామిడికుదురు: సాగు నీరందకపోవడంతో వరి చేలు ఎండిపోయి నెర్రలు తీశాయని, తక్షణమే పంటకు నీరందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో హైవేపై శుక్రవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. అధికారులు తక్షణమే నీరందించి, ఎండిపోతున్న వరి చేలను రక్షించాలని రైతులు కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు అందజేశారు. మామిడికుదురు సర్పంచ్ గోస్ మోహిద్దీన్, రైతు నాయకులు జాలెం సుబ్బారావు, పీతల రామచంద్రరావు, భాస్కరరావు, ఆనందరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మామిడికుదురు: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు, కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రోడ్యూసర్స్ కంపెనీ నిర్వాహకులు కోరారు. విశాఖపట్నంలో రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొబ్బరి రైతులు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై ఆధారపడిన నిర్వాహకుల సమస్యలను ఆయనకు వివరించారు. నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొబ్బరిని అధిక ధరలకు కొనుగోలు చేయాలని, కోనసీమలో కొబ్బరి సంబంధిత ఉత్పత్తుల భారీ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్‌కుమార్, ఎఫ్‌పీఓ చైర్మన్ వేగి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కోకోనట్ కన్వీనర్ గనిశెట్టి అరిండ్, జిల్లా కిసాన్ మోర్చా కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, యనమదల వెంకటరమణ పాల్గొన్నారు.